

### యధార్థ గాథ:

# సౌదామిని 'మౌనం'!

పల్లెటూరి ప్రశాంత వాతావరణం, పట్నంలోని ఆధునిక సౌకర్యాలూ రెండూ వున్న చిన్న టౌను అవూరు. పెంకుటిళ్ళూ, పాకలూ, అక్కడక్కడ ఒకటి రెండు పెద్ద మేడలతో వున్న ఆ వూరి పడమర వీధికి మధ్యలో వున్న చిన్న సందులోని ఆ అమ్మాయి ఇంటిని వెదుక్కుంటూ వెళ్ళాను.

అదొక చిన్న పెంకుటిల్లు. ఆ ఇంటి వసారాలోని ఒక స్తంభానికి ఆనుకుని అమ్మా కూతుళ్ళిద్దరూ కూర్చుని వున్నారు. నన్ను చూడగానే పలకరింపుగా లేచి నుంచుంది తల్లి. కూతురు మాత్రం నేను వచ్చిన సంగతి ఏమాత్రం పట్టించుకున్నట్లు లేదు. మౌనంగా శూన్యంలోకి చూస్తోంది. చామన ఛాయ, గుండ్రటి ముఖం, అందమైన పెద్ద కళ్ళు—కాని జీవితమే చేజారిన దిగులుతో నిండిన చూపులతో కనిపించిన ఆ అమ్మాయి పేరు సౌదామిని!

"ఆరోగ్యం బావుంది కదా?" నెమ్మదిగా పలకరించాను.

"ఆరోగ్యానికేం బాగానే వుంది. దాని మనసే బాగాలేదమ్మా" అంది ఆమె తల్లి సుందరమ్మ.

"అయితే నేను విన్నదంతా నిజమేనా?"

"నిజమే తల్లీ. నా బిడ్డ బ్రతుకు నా కళ్ళ ముందే బండలపాలయింది." అంటూ తన కూతురి కన్నీటిగాథను చెప్పడం ప్రారంభించింది సుందరమ్మ.....

"సౌదామిని స్కూల్ ఫైనల్ చదువుతున్నప్పుడు ఒక రోజు కడుపునొప్పి అంది. అది ఋతుస్రావం సమయంలో వచ్చే మామూలు నొప్పిగానే వుంటుందని నేను అనుకున్నాను. ఏవేవో ఇంటి వైద్యాలు చేసి చూశాను. కాని ప్రయోజనం కనిపించ లేదు. మా ఇంటికి దగ్గర్లో వున్న కంపౌండర్ దగ్గిరికి వెళ్ళి చూపాను. 'కడుపునొప్పి వస్తే బెరాల్గన్ మాత్రలు వాడితే సరిపోతుంది' అని కొన్ని మాత్రలు ఇచ్చాడు. కడుపునొప్పి కాస్త తగ్గడం ప్రారంభించింది.

రోజులు పోను పోను సౌదామిని కడుపు కాస్త పెద్దది కావడం ప్రారంభమయింది. నేను కంగారు పడ్డాను. కాని కడుపులో గడ్డలాంటిది ఏదైనా వుండొచ్చని ఇరుగు పొరుగు వాళ్ళు చెప్పారు. కంపౌండర్‌ను సంప్రదిస్తే, అతనికి తెలిసిన ఒక లేడీ డాక్టర్ దగ్గిరికి తీసుకెళ్ళాడు. ఆమె కడుపూ అదీ అటూ ఇటూ నొక్కి చూసి, కడుపులో గడ్డ ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతోందని, అది బాగా ముదిరితే తప్ప ఆపరేషన్ చేయడం సాధ్యం కాదని చెప్పి పంపేశారు. మూడు వారాలు గడిచాయి. సౌదామిని విపరీతంగా కడుపునొప్పి అని ఏడ్వడంతో నేనూ, పక్కింటి వాళ్ళూ కలిసి, గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకెళ్లాము.

ఆస్పత్రిలోనే మబ్బుల్లేని పిడుగులా మాకా భయంకర సత్యం తెలిసింది. సౌదామిని కొంత సేపట్లో తల్లి కాబోతోందిట!

నా నెత్తి మీద నిప్పుల వర్షం కురిసినట్లయింది!

అయినా అమాయకురాలైన నా బిడ్డను ఈ దుర్గతి పాలు చేసిన దుర్మార్గుడెవడని పరితపించి పోయాను. నెత్తీ నోరూ మొత్తుకుంటూ అమ్మాయిని నిలదీశాను. కాని ప్రయోజనం కనిపించలేదు. చివరికి డాక్టర్ వచ్చి భయపెట్టిన తర్వాత నోరు తెరిచింది సౌదమిని. మాతో పాటు ఆస్పత్రికి వచ్చిన మా పక్కింటావిడ కొడుకే ఈ దుస్థితికి కారణం అంది సౌదామిని!

సౌదామిని, పక్కింటి అమ్మాయి విమల ఒకే క్లాసులో చదువుకుంటున్నారు. వాళ్ళిద్దరికీ మంచి స్నేహం. విమలను చూడడానికి సౌదామిని తరచూ వాళ్ళింటికి వెళ్తూ వుండేది. ఆ అవకాశాన్ని అసరాగా తీసుకుని విమల అన్నయ్య రఘునాథ్ మంచి మాటలు చెప్పి వలలో వేసుకున్నాడు.

మా రెండు ఇళ్ళూ పక్క పక్కనే వున్నప్పటికీ రెండు కుటుంబాలకూ ఒకటే బావి. మేము ఎవరూ ఇంట్లో లేని సమయంలో నీళ్ళు తోడడానికి బావి దగ్గరికి వెళ్ళిన సౌదామిని శీలాన్ని తొలిసారిగా దోచుకున్నాట్ట రఘునాథ్! అటుపైన వాళ్ళిద్దరూ. అడపా దడపా అవకాశం దొరికినప్పుడల్లా ఏకాంతంలో కలుసుకునే వాళ్ళట. కొన్నాళ్ళకు సౌదామిని నెల తప్పిందని తెలియగానే మందు మాకులతో కడుపు తీయించడానికి రఘునాథ్ శతవిధాలా ప్రయత్నించాట్ట. కాని సాధ్యం కాలేదు. చివరికి మేము సంప్రదించిన లేడీ డాక్టర్ దగ్గరికి ముందుగానే వెళ్ళి అసలు సంగతి బయట పెట్టవద్దని బెదిరించి, కడుపులో గడ్డ వుందని అబద్ధం చెప్పించింది కూడా వాడేనట. ఇంతకీ ఇన్ని అఘాయిత్యాలకు పాల్పడ్డ రఘునాథ్ ఎవరనుకున్నారు? అల్లరి చిల్లరగా తిరిగే కుర్రాడు కాదు. మా వూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్!

ఆ మాట వినీ వినగానే మాతో ఆస్పత్రికి వచ్చిన పక్కింటి వాళ్ళు మా మీద కారాలు మిరియాలు నూరుతూ వెళ్ళిపోయారు.

సౌదామిని మగశిశువును ప్రసవించింది. ఆ రాత్రంతా కంటిమీద రెప్ప వేయలేదు. తెల్లవారు జామున ఆస్పత్రి నుంచి వెలుపలికొచ్చి ఎదురుగా వున్న టీకొట్లో కాఫీ తీసుకుని వచ్చేలోపల తల్లి ప్రక్కన వున్న శిశువు కనిపించలేదు. ఆస్పత్రంతా వెదికాను. అందర్నీ అడిగాను. ఎవ్వరూ శిశువు జాడ గురించి చెప్పలేదు. ఆస్పత్రి సిబ్బంది కొందరైతే "'దొంగలున్నారు జాగ్రత్త!' అని బోర్డు పెట్టాం కదా? మరీ అంత అజాగ్రత్త అయితే ఎలా?" అని చీవాట్లు పెట్టారు. చీదరించుకున్నారు.

ఆఖరికి నేనూ నా బిడ్డ పడే వేదన చూసి సహించలేక ఒక ఆయా నన్ను ఫక్కకు పిలిచింది. తెల్లగా వున్న పోలీసు ఇన్‌స్పెక్టర్ బాబు మఫ్టీలో వచ్చి డాక్టరమ్మతో ఏదో మాట్లాడిన తర్వాత ఆ పసికందును ఒక తెల్ల గుడ్డలో చుట్టి తీసుకుని మోటారుసైకిలుపై వెళ్ళాడని చెప్పింది. అయినా ఈ మాట తాను చెప్పినట్లు తెలిస్తే తన బతుకు బూడిదవుతుందనీ, ఎక్కడా చెప్పవద్దనీ ప్రాధేయపడింది.

ఇక చేసేదిలేక బాలింతరాలిని తీసుకుని ఇంటికి వచ్చాను. కొన్ని రోజులపాటు తల బయట చూపలేక కుమిలాను. కాని అలాగే వుంటే నా బిడ్డ బ్రతుకు ఏం కాను? మనసు దిటవు చేసుకున్నాను. నా బాధ ఇరుగు పొరుగుతో చెప్పుకున్నాను. 'పంచాయితీ పెట్టించండి' అన్నారు. అలాగైనా తను 'అతని' దగ్గరికి వెళ్ళగలదేమో అన్న ఆశతో సౌదామిని కూడా అందుకు సరేనంది.

పంచాయితీ పెద్దలతో చెప్పుకున్నాను. వాళ్ళు విచారణ జరిపారు. నన్ను సవాలక్ష ప్రశ్నలు అడిగారు. వారి ప్రశ్నలకైతే సమాధానాలు చెప్పగలిగాను గాని వాళ్ళు తెమ్మన్న సాక్ష్యాధారాలు మాత్రం తేలేకపోయాము. చివరికి సౌదామిని పురుడు పోసుకుందన్న పచ్చినిజాన్ని కూడా నిరూపించలేకపోయాము! ఎందుకంటే సర్టిఫికేట్ కోసం ఆస్పత్రికి వెళ్ళి అడిగితే వాళ్ళు 'అసలు నిన్నుగాని, సౌదామినినిగాని చూసిందే లేదు. సర్టిఫికేట్ ఎలా ఇస్తాం? పోపొ'మ్మన్నారు. కాళ్ళావేళ్ళాపడి బ్రతిమలాడాము. 'ఆస్పత్రిలో ఆగడం చేస్తే పోలీసులకు అప్పగిస్తా'మని బెదిరించారు. సరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్దామా అంటే—మా బ్రతుకులో చిచ్చురగిల్చిన వాడే అక్కడ అధికారి! అధికారం ముందు మా బలహీనత మరింత ఎగతాళికి గురయింది. డబ్బు చేసిన గారడీలో మా బతుకులు మరింత నవ్వులపాలయ్యాయి!

తీరా విచారణ ముగిసిన తర్వాత పంచాయతీ వాళ్ళిచ్చిన తీర్పు ఇది:

"పొలం పచ్చగా వుండంటే గట్టిగా కంచె వెయ్యాలి. కంచెవేసినా ఏ అర్ధరాత్రిలోనో ఏదో ఒక దొంగగొడ్డు పడి మేసేసిందే అనుకుందాం. తెల్లవారాక చూసి, పొరబాటున ఆ పొలానికి దగ్గర్లో ఇల్లు కట్టుకున్నవాడి గిత్తే మేసిందనడానికి ఆధారం ఏమిటి? లక్ష గొడ్లు మేసివుండొచ్చు! పక్కింట్లో వుందన్న ఒక్క కారణం వల్లే నోరూవాయీలేని జీవం మీద నిందమోపడం న్యాయం కాదు!"

ఆ తీర్పుకు ఎదురు చెప్పలేక మరింత అవమానపడి వచ్చేశాము." అని కన్నీళ్ళు తుడుచుకుంది సుందరమ్మ.

అంతవరకూ అక్కడే కూర్చున్న సౌదామిని కుమిలికుమిలి ఏడుస్తూ లేచి మౌనంగా లోపలికి వెళ్ళింది!

"ఆ ఇన్‌స్పెక్టర్‌వాళ్ళు ఇంకా మీ ఇంటి పక్కనే వుంటున్నారా?"

"వాళ్ళెప్పుడో ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వేరే వూరు వెళ్ళిపోయారు."

ఎంతో కొంత చదువూ, లోకజ్ఞానం వుండి కూడా వయసుపొంగులో అమాయకంగా కాలుజారిన ఇరవైయేళ్ళ సౌదామిని మౌనంలో వెయ్యేళ్ళ వేదన వినిపించింది.

నయవంచకుని మాటలు నమ్మి శీలం పోగొట్టుకున్న సౌదామిని—అధికార దర్పానికి తల వొగ్గి డబ్బుకు దాసోహమని, అవినీతికి కర్ణకవచంగా నిలిచే ఈ సమాజంలో కన్న బిడ్డను పోగొట్టుకుంది! సాటివారిలో తలెత్తుకోలేక ఉచ్చుల్లో తగుల్కొన్న పిచ్చుకలా విలవిలలాడుతోంది ఆమె హృదయం. నాకు తారసపడింది ఒక్క సౌదామిని. వెలుగులోకి రాని సౌదామినులు మరెంతమంది వున్నారో! ఊహించేవాళ్ళెవరు? వాళ్ళను గురించి ఆలోచించేవాళ్ళెవరు?

—పుష్పలత

[ఈ 'యధార్థగాథ'లోని వ్యక్తుల పేర్లు మాత్రమే కల్పితం.]



ఎమ్. లలితకుమారి

శ్రీమతి లలితకుమారి 1981-'82 సంవత్సరపు ఉత్తమ ఉపాధ్యాయినిగా రాష్ట్ర ప్రభుత్వపు అవార్డు పొందారు. ఆమె ప్రస్తుతం విజయనగరం మహారాజ స్త్రీల కళాశాలలో జువాలజీ శాఖాధ్యక్షురాలుగా వుంటున్నారు. 1956 నుండి '63 వరకు ఎన్. సి. సి. పార్ట్‌టైమ్ ఆఫీసర్‌గా వున్న లలితకుమారి 1963-64 లో ఎన్. సి. సి. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా వున్నారు. 1978-79 లో విశాఖపట్నం విశాఖ స్త్రీల కళాశాలకు ఒక సంవత్సర కాలం పాటు ప్రిన్సిపాల్ పదవిలో వున్నారు.